

● కుభీర్ కళాశాలలో అధ్వాన స్థితిలో ఉన్న నీటి వ్యవస్థ


కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తున్న వీసీ, ఓఎస్డీ

ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్ ప్రారంభం

బాసర, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీతో పాటు మహబూబ్‌నగర్ కేంద్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొ.గోవర్ధన్ అధికారికంగా ప్రారంభించారు. ఓఎస్డీ ప్రొ. మురళీదర్శన్‌తో కలిసి సంగారెడ్డి జిల్లా కామోల్ గ్రామానికి చెందిన గడ్డం వర్షికకు తొలి అడ్మిషన్ పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది మొత్తం 1690 మందికి ప్రవేశాలు కల్పిస్తుండగా.. ప్రతీరోజు 564మంది విద్యార్థులను అధికారులు కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నారు. సోమవారం జరిగిన కౌన్సెలింగ్‌కు మొత్తం 564 మంది విద్యార్థులు పిలవగా.. 500మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోసం విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒక్కో గదిలో 20 మంది చొప్పున కౌన్సెలింగ్‌కు కేటాయించి ప్రశాంతంగా కొనసాగించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు భోజన వసతులు సైతం కల్పించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళ, బుధవారాల్లో కొనసాగనుంది. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్న మహబూబ్‌నగర్ కేంద్రానికి చెందిన కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా బాసర కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. కాగా.. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలోనే వెయిటింగ్ లిస్టు ఆధారంగా భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే రద్దు చేయాలి : ట్రస్మా

నిర్మల్ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అలాగే గడిచిన 5ఏళ్ల నుంచి కొన్ని పాఠశాలల్లో కేవలం 7వ తరగతి వరకే అనుమతులు ఉన్నా.. 10వ తరగతి క్లాసులు నిర్వహించటం గురించి, కొన్ని పాఠశాలలు నడుపు పాఠశాల సమయం గురించి జిల్లా విద్యాశాఖ అధికారికి, కలెక్టర్ ఫిర్యాదు విభాగంలో వినతిపత్రం ఇచ్చినట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షులు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు జిల్లా విద్యాధికారికి వినతులు సమర్పించినట్లు తెలిపారు. ఇందులో జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, టౌన్ బాధ్యులు చంద్ర గౌడ్, శ్రీధర్, పద్మనాభ గౌడ్, శ్యామ్ ప్రకాష్, అబ్బాస్, షబ్బీర్, ప్రమోద్ రావు, వినోద్, శ్రీనివాస్, తదితరులున్నారు.

జూనియర్ కళాశాలలకు.. మహర్దశ



● లోకేశ్వరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో పరుశురాం నాయక్

- జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- తొమ్మిది కళాశాలకు రూ. 1.58 కోట్ల మంజూరు
- తొలగనున్న విద్యార్థుల సమస్యలు
- సమకూరనున్న వసతులు, సౌకర్యాలు

భైంసా, జూలై 7(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల నిర్వాహణ వ్యవస్థను మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమస్యలను పరిష్కరించి వసతులు, సౌకర్యాలు సమకూర్చి వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు సంకల్పించింది. ఇది వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు కేటాయింపు నామమాత్రంగా ఉండేది. విద్యార్థుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం.. మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చింది. అంతేకాకుండా దశాబ్ద కాలం తర్వాత భారీ మొత్తంలో నిధులను ఇంటర్ విద్యాశాఖ మంజూరు చేయడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుగా ఉండగా, అందులో 9 కళాశాలలకు రూ. 1.58 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో 4 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు కాలేదు.


● కుభీర్ జూనియర్ కళాశాలలో దెబ్బతిన్న ఫర్నిచర్

● ..దుస్థితిలో బాలికల మూత్రశాల



మూడు నెలల క్రితం

కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ఆ దస్త్రానికి గత నెలలో ప్రభుత్వ ఆమోద ముద్ర పడింది. పదేళ్ల క్రితం వరకు ఎన్ఆర్డీపీ కింద ఏటా నిధులు మంజూరు చేశారు. అవి ఆగిపోవడంతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సొంతంగా ఖర్చు పెట్టడంతో పాటు దాతల సహకారంతో వివిధ పనులు చేయించారు. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు ఉండవన్న భావన నెలకొంది. ఇక ఆ సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశముంది.

పేరుకపోయిన సమస్యలు

పది సంవత్సరాలకు పైగా కాలం నుంచి నిధుల మంజూరి లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోక పేరుకపోయాయి. అసౌకర్యాల మధ్యనే విద్యా బోధన కొనసాగుతోంది. ఫర్నిచర్ కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.వసతుల లేమి, సౌకర్యాల కరువుతో ప్రతియేటా విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిధులతో జూనియర్ కళాశాలల్లో తిష్ట వేసిన సమస్యలు దూరం కానున్నాయి. సంబంధిత నిధుల ద్వారా విద్యుద్దీకరణ, నీటి సరఫరా, పారిశుధ్యం, ఫర్నిచర్ బోరు బావితో పాటు ఇతర వసతులు కల్పించనున్నారు. అవసరమైన మరమ్మత్తులు చేపట్టనున్నారు. పక్కా భవనాలున్న వాటికి ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో అత్యధికంగా సారంగపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.39 లక్షల నిధులు మంజూరు చేసింది.

కమిషనర్ ప్రత్యేక చొరవతో..

ఇంటర్ బోర్డు విద్యా కమిషనర్‌గా గతేడాది కృష్ణ ఆదిత్య బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి కళాశాలల నిర్వాహణ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశా కార్యచరణ అమలులోకి వచ్చింది. కమిషనర్ పకడ్బందీ విధానాలు, ప్రణాళికబద్ధమైన చర్యలు చేపడుతున్న సంస్కరణల మూలంగా కళాశాలల నిర్వాహణ వ్యవస్థ మెరుగవుతోంది. సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. చాలా కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయించి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసందానం చేశారు. ప్రయోగ పరికరాల కోసం గాను ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు చేపట్టారు. బోధన వ్యవస్థ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో కళాశాలల పనితీరు, ఫలితాల్లో చాలా మార్పులు వచ్చాయి

జిల్లాలో నిధుల కేటయింపు ఇలా..

జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఉండగా.. వీటిల్లో నాలుగు కళాశాలలు మినహా.. మిగతా 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 1.58 కోట్ల నిధులు మంజూరయ్యాయి. భైంసా, ముథోల్ కేంద్రాల్లోని జూనియర్ కళాశాలల భవనాలు పతానవస్థ దశకు చేరుకోవడంతో ఈ కళాశాలలకు నిధులు కేటాయించలేదు. త్వరలోనే ఈ రెండు కళాశాలలకు నూతన భవనాలు మంజూరు కానున్నాయి. ఇక తానూర్, కుంటాల మండల కేంద్రాల్లోని జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో.. ఇక్కడి రెండు కళాశాలకు నిధుల కేటాయింపులు జరుగలేదు. కాగా, ఇక నిధుల మంజూరైన కళాశాలల వివరాలిలా.. లోకేశ్వరం ప్రభుత్వ కళాశాలకు రూ. 6.5 లక్షలు, కుభీర్ కళాశాలకు రూ.11 లక్షలు, నిర్మల్ బాలుర కళాశాలకు రూ.20 లక్షలు, నిర్మల్ బాలికల కళాశాలకు రూ.7.5 లక్షలు, దిలావర్‌పూర్ కళాశాలకు రూ.9 లక్షలు, సారంగపూర్ కళాశాలకు రూ.39 లక్షలు, మామడ కళాశాలకు రూ.16.5 లక్షలు, ఖానాపూర్ కళాశాలకు రూ.27 లక్షలు, కడెం కళాశాలకు రూ.22 లక్షల నిధులు మంజూరయ్యాయి.


బాసరకు చేరుకున్న భువనేశ్వరీ పీఠాధిపతి పాదయాత్ర

బాసరకు చేరుకున్న భువనేశ్వరీ పీఠాధిపతి పాదయాత్ర

బాసర,జూలై 7(ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలకు చెందిన భువనేశ్వరీ పీఠాధిపతులు పరమహంస కమలానంద భారతిస్వామి పాదయాత్ర సోమవారం బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రానికి చేరుకుంది. వీరికి ముందుగా ఆలయ అర్చకులు, బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమలానంద భారతిస్వామి మాట్లాడుతూ.. హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రలో భాగంగా తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయాన్ని సందర్శిస్తూ.. అక్కడి దేవాలయ పరిరక్షణ, ధూపదీప నైవేద్యాలు, ఆలయ చరిత్ర వంటి విశేషాలపై భక్తులను ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తూ.. మన దేవాలయాన్ని మనమే కాపాడుకోవాలి. మన సమాజాన్ని మనమే సేవించుకుందాం. అనే నినాదంతో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. హిందూ దేవాలయాల యువ చైతన్య మహాపాదయత్ర చేపడ్డంతో పాటు మన ధర్మం కోసం దేశం కోసం దేవాలయం కోసం భాష కోసం మన ప్రకృతి రక్షణ కోసం పాదయాత్ర ప్రారంభించమన్నారు. గత నెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి తలకోన సిద్దేశ్వర స్వామి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు.

నేటి నుంచి బాసరలో గురుపౌర్ణమి వేడుకలు

● మూడురోజుల పాటు కార్యక్రమాలు


వ్యాసమహర్షి విగ్రహం

బాసర, జూలై 7(ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో మంగళవారం నుంచి గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. మూడురోజులు పాటు అమ్మవారి ఆలయం వద్ద గల వేదవ్యాస మహర్షి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మొదటిరోజు శాంతి మంత్ర పఠనం గణపతి పూజ, పుణ్యాహవచనము మండపారాధన అగ్నిస్థాపన వంటి పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. లోకకళ్యాణార్థం చండీయాగాన్ని నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని వినతి


ఇళ్లు కావాలని వేడుకుంటున్న మహిళ

దిలావర్‌పూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : 'అమ్మా.. నాకు ఉండటానికి ఇళ్లు లేదు... రెక్కాడితే గాని డొక్కాడని బతుకు మాది. నా భర్త ప్రమాదంలో రెండు కళ్లు విరిగి మంచాన పడ్డాడు. నాకు కూతురు ఉంది. మేము పేదోళ్లం... జర దయ చెయ్యండ్రి... అంటూ దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా ఎంపీడీవో అరుణ రాణిని సోమవారం వేడుకుంది. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు సైతం చేసుకున్నట్లు చెప్పింది. ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామంటే ఎంతో సంతోషమైంది. కానీ లిస్టులో నాపేరు లేదని చెప్పగానే ఏడుపొచ్చింది. మా అసుంటోళ్లకు కాకుంటే ఓళ్లకు ఇస్తరు... అంటూ కన్నీటి పర్యంతమైంది. ఇప్పుడు ఇళ్లు కట్టుకుంటావా... అని ఎంపీడీవో అడుగగా... మీరు కట్టుకొమ్మంటే ఏడైనా అప్పు తెచ్చి కట్టుకుంటానని చెప్పింది. విచారణ చేసి తప్పనిసరిగా ఇళ్లు ఇస్తామని, బాధపడొద్దని ఎంపీడీవో చెప్పడంతో వెళ్లిపోయింది.

వాహనాలు సీజ్ చేయండి

● నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


బోరిగాంలో అధికారులతో మాట్లాడుతున్న దృశ్యం

లక్ష్మణచాంద, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో పల్లె ప్రకృతివనంలో చెట్లను తొలగించిన జేసీబీ, ట్రాక్టర్‌లను సీజ్‌చేసి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఆదేశించారు. చెట్లను తొలగించి చదును చేసిన స్థలాన్ని పరిశీలించారు. పల్లెప్రకృతి వనంలోని చెట్లను తొలగిస్తుంటే మీరేం చేస్తున్నారని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాథోడ్, నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి, అడ్వాల రమేష్, తిరుపెల్లి చిన్నయ్య, జీవన్ రెడ్డి, మోహన్ రెడ్డి ఉన్నారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంలోని రైతువేదిక సోమవారం సందడిగా మారింది. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, కళ్యాణలక్ష్మీ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతువేదిక ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగింది. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న కల్యాణలక్ష్మీ పథకం ద్వారా మంజూరైన నిధులతో కూడిన చెక్కుల ను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి స్వయంగా అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ విద్యాలయం ఆవరణలో మొక్కను నాటారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, మండల విద్యాధికారి సాయన్న, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, చెన్నా మహేష్, వినోద్ రెడ్డి, నార్వాడే ప్రవీణ్, బొల్లి గంగారాం, తద్దురాం, బర్కుంట నరేందర్, బర్కుంట లక్ష్మణ్, టెంబుర్ని గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : నన్ను అన్నగా భావించి అఖండమెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యేను చేసిన మీ రుణం తీర్చుకోలేనిదని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జిల్లా, మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : తండాలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో గల దుర్గానగర్ తండాలో నూతన పాఠశాల భవనానికి మంజూరైన రూ.10లక్షలతో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో గల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై అధికారులతో మాట్లాడారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాల్వనరేష్, బీజేపీ నాయకులు రాంకిషన్‌రెడ్డి, చంద్రప్రకాష్‌గౌడ్, గంగారెడ్డి, కరిపే విలాస్ చెన్నె రాజేశ్వర్, తిరుమల చారి, సాయబ్‌రావు, మధు, వీరయ్య నాయకులున్నారు.

నిర్మల్‌రూరల్ : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్మల్‌పట్టణం (266), రూరల్ (72) మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి భీమ్ రెడ్డి, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్

ముథోల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో భాగంగా ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో 500ల ఈత మొక్కలు, విట్టోలి తాండ గ్రామంలో 500ల ఈత మొక్కలను సోమవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకం పైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటడం ముమ్మరంగా చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, ఏపీవో శిరీషా రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గౌడ సోదరులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలను నాటుతున్న దృశ్యం

కస్తూర్బా గాంధీ విద్యాలయం తనిఖీ

నర్సాపూర్(జి), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశా రు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. విద్యాలయం నుంచి అదనపు వసతుల మంజూరు కోరుతూ అందిన వినతిపత్రంపై స్పందించి, వాటి అవసరాన్ని, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించేందుకు ఈ తనిఖీ చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ వివరించారు. విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిం చాల నే ఉద్దేశంతోనే ఈ పరిశీలన జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. తనిఖీల్లో భా గంగా తహసీల్దార్ శ్రీకాంత్ విద్యాలయంలోని వంట గది, బోధన గదులు, టాయి లెట్స్ వంటి ముఖ్యమైన విభాగా లను క్షుణ్ణంగా పరిశీలించారు.

కేజీబీవీని సందర్శించిన ఎంపీడీవో

సోన్ : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఎం పీడీవో సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా వసతుల కల్పనను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం భోజన కమిటీ, పారిశుధ్య సిబ్బందితో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు.

దస్తురాబాద్ : ప్రతి విద్యార్థి కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ముచ్చ టించారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, పట్టుదలతో చదవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పాఠశాల హాస్టల్ గదులు, వంట గది, తరగతి గదులు మొదలైన వసతులను పరిశీ లించారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చ నిర్వహించి, వారి అవసరాలను తెలుసు కున్నారు. పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దార్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇందులో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించండి

● జేఏసీ నిరసన


ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

ఖానాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ఖానాపూర్‌లో జరగాలనేది నాలుగు మండలాల ప్రజల డిమాండ్ అని జేఏసీ కన్వీనర్ నంది రామయ్య అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని నిర్ధారించేందుకు నిర్వహించనున్న 110 ఎకరాల ప్రభుత్వ భూమి సర్వేను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లోని నిర్మల్, ఖానాపూర్ రహదారిపై ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ... 110 ఎకరాల ప్రభుత్వ భూమిలో పట్టాలు అక్రమంగా కలిగి ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 110 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎంతటి వారున్నా చర్యలు చేపట్టాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమకు ఎమ్మెల్యేపై ఎటువంటి ద్వేషం లేదని తమ డిమాండ్ రాజకీయపరమైనది కాదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తాము కేవలం నాలుగు మండలాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన కోసం పోరాడుతున్నామే తప్పా రాజకీయ లబ్ధి పొందేందుకు కాదన్నారు. తమకు పది నిమిషాల సమయం కేటాయించాలని ఎమ్మెల్యే పీఆర్‌వోకు ఫోన్ చేసినా ఇప్పటి వరకు ఎమ్మెల్యే టైమ్ కేటాయించలేదన్నారు. జేఏసీ నాయకులకు ఓ పది నిమిషాల సమయాన్ని కేటాయిస్తే 110 ఎకరాల తాలూకు తమ వద్ద ఉన్న సమాచారాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు వివరిస్తామన్నారు. ఖచ్చితంగా ఖానాపూర్‌లో మొదటి స్కూల్‌ను నిర్మాణం చేసి రెండవ స్కూల్‌ను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఏర్పాటు చేసి రెండు ప్రాంతాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు సాగి లక్ష్మణరావు, కో కన్వీనర్లు ఆకుల శ్రీనివాస్, బీసీ రాజన్న, కొండాడి గంగారావు, ప్రధాన కార్యదర్శి కాశవేణి ప్రణయ్, కోశాధికారి ఎనగందుల నారాయణ, ముఖ్య సలహాదారులు అంకం మహేందర్, రాపెల్లి రవీందర్, అబ్దుల్ ఖలీల్, నారాయణ, శ్రావణ్, గౌరీకర్ రాజు, పుప్పాల ఉపేందర్, తదితరులున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్
జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ఎంపీ అనిల్ యాదవ్


అనిల్ కుమార్ యాదవ్

భైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత నిర్మాణాన్ని చేపట్టి పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా తెలంగాణ కాంగ్రెస్ కమిటీ చర్యలను ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించిన టీపీసీసీ, సోమవారం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జ్‌గా రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమించింది.

ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నిర్మల్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాం కేంద్రాన్ని నెల వారీ సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం లోని అన్ని రిజిస్టర్లు, భద్రత ప్రమాణాలను ఆమె సమీక్షించారు. సీసీ కెమె రాల పర్యవేక్షణలో గోదాం భద్రత నిరంతరంగా కొనసాగించాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం గోదాం ప్రాంగణంలో వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఉట్నూర్‌లో జెండా ఆవిష్కరించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉట్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవంను సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఘనం గా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మార్పీ ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్య క్ర మంలో అడ్వకేట్ కొమ్ము విజయ్‌కుమార్, బిరిగేడి వినయ్, బచ్చలిప్రవీణ్, జిల్లాపెల్లి అశోక్, కొల్లూరి స్వామి, రాజు, మహేశ్, రవి, విజయ్, రాకేష్, పరమేశ్వర్, ప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేరడిగొండ : ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గజ్జల శంకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సింగారపు లస్మన్న మాదిగ, గోసే పాల్గొన్నారు.

బోథ్ : ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందు నిలబడిందని ఎమ్మా ర్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో జెండా ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రవి అన్న, పాగా అశోక్, నల్ల చిన్నయ్య, బిక్క అశోక్, బత్తిని గంగయ్య, ఎర్రన్న, సిహెచ్ భోజన్న, ఆశన్న, రమణయ్య పాల్గొన్నారు. మండలంలోని కౌటాబి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు దాసరి గంగాధర్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో బి. శ్రీకాంత్ రెడ్డి

భీంపూర్ : మండలంలోని నిపాని, కరంజీ టి, బీంపూర్ గ్రామాలలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, మంద కృష్ణ మాదిగ జన్మదినం వేడుకలు నిర్వహించారు. అలాగే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావం సందర్భంగా ఎమ్మార్పీఎస్ భీంపూర్ మండల అధ్యక్షుడు దర్శనాల పోచన్న జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశోక్, రమేష్, గౌతమ్, గులాబ్, రాజు, గంగన్న, శివన్న, కార్తీక్, గౌస్,క డధరపు పంజాబ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : సంఘం మండలాధ్యక్షుడు ఆందారే బాలాజీ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ, ఉప్పులేటి శ్రీనివాస్ మాదిగ, లింగంపల్లి రాజన్న మాదిగ, నర్సింగ్ మాదిగ, స్వామి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మావల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పలు బాధిత కుటుంబాలకు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సోమవారం పరా మర్శించారు. నీటిగుంతలో పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బోరజ్ మండలం పిపర్వాడ గ్రామా నికి చెందిన సరసన్ వెంకట్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అదేవి ధంగా, జైనాథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన కీర్తిశేషులు గణపతి రెడ్డి కుటుంబ సభ్యులను, ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రంగినేని మనీష కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట మావల కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, నలిమేల నవీన్ రెడ్డి, రెండ్ల రాజన్న, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోండి'

బోథ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలో మంజూరు అయిన ఒక ఒక వంద 84 ఇందిరమ్మ ఇండ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో దుర్గం రాజేశ్వర్, ఎంపీఈవో మనోహర్ రెడ్డిలు కోరారు. సోమవారం గ్రామ కార్యదర్శి రమణతో కలిసి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి కలవడం జరిగింది. ఇళ్లను బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి మొదటి విడతగా వారీగా అకౌంట్లో నిధులు జమ చేయడం జరిగిందని లబ్ధిదారుల వివరించారు. మంజూరైన 45 రోజుల వరకు ఇందులో ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలని లేకుంటే జాబితా నుంచి లబ్ధిదారుల పేర్లను తొలగించడం జరుగుతుందని వివరించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంపీవోలు

కాగా లబ్ధిదారుల వద్ద డబ్బులు లేకపోవడం వల్ల ఇండ్లను నిర్మించలేకపోతున్నారని తెలిసింది.

ఘనంగా మొహరం ఉత్సవాలు

బజార్‌హత్నూర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతికగా భావించే మొహర్రం ఉత్సవాలు సోమవారం ముగిశాయి. బజార్‌హత్నూర్ మండల కేంద్రంతో పాటు దేగామ, కొల్హారి, పిప్పిరి, గిర్నూర్, గోకొండ, జాతర్ల, మొర్ఖండిలలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి డప్పుల చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగించారు. గ్రామాల్లో వర్షంలో కూడా పీరీల ఉత్సవ సందడి కొనసాగుతుంది.

బోథ్ : మండలంలో సోమవారం పీరీల ఊరేగింపు మొహర్రం పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు కౌట (బి) దన్నూర్ సోనాల గ్రామాలలో నిర్వహించారు. వేడుకలలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కౌటబి గ్రామంలో పీర్ల ఊరేగింపును తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

నేరడిగొండ : మండలంలోని కుంటాల గ్రామంలో గల పీరీలను సోమవారం బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఆడే గజేందర్‌ను గ్రామస్తులు ఘన స్వాగం పలికి సన్మానించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లడ్డు ప్రసాదం తయారీ

బోథ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని శబరిమాత ఆశ్రమంలో గురు పౌర్ణమి వేడుకలకు గాను లడ్డు ప్రసాదాన్ని మండలంలోని కౌట (బి) గ్రామ శబరిమాత ఆశ్రమంలో సోమవారం నుంచి తయారు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం శబరిమాత ఆశ్రమంలో భక్తులు తమ సొంత ఖర్చులతో లడ్డు ప్రసాదాన్ని తయారుచేసి అక్కడ జరిగే గురు పౌర్ణమి వేడుక కార్యక్రమంలో విక్రయించడం జరుగుతుంది. లడ్డు విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని శబరిమాత ఆశ్రమానికి భక్తులు చందాగా ఇవ్వడం జరుగుతుంది.

ఆత్మ బోథ్ బ్లాక్ అధ్యక్షుడిని సన్మానించిన యాదవ సంఘం

బోథ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఆత్మ చైర్మన్ జి. రాజుయాదవ్‌ను సోమవారం మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన యాదవ సంఘం వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్ మాట్లాడుతూ కృషిచేయాల్సిన బాధ్యత తనపై మరింత పెరి గిందన్నారు. తన ఆధీనంలో ఉన్న అన్ని రకాల ప్రభుత్వ సంస్థలలో నుండి నిధులు తీసుకువచ్చి రైతులకు ఉపయోగపడేలా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నార్నూర్, జూలై 07 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి గంగాపూర్ క్రాస్ రోడ్ దగ్గర డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై కె.అఖిల్ తెలిపారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేశారు. వాహనాలకు నంబర్ ప్లేట్ ఉండాలన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలి పేర్కొన్నారు. వెంట పోలీస్ సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



చేరిన నాయకులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని అట్నంగూడ గ్రామానికి చెందిన 326 మంది గులాబీ కండువాలు కప్పుకున్నా రు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో ఊరంతా పార్టీ కండువాను కప్పుకున్నారు. గ్రామ సరిహద్దు ల్లోకి ఎమ్మెల్యే రాగానే మహిళలు, చిన్నలు, పెద్దలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. కుంకుమ తిల కందిద్ది ఎమ్మెల్యేను గ్రామంలోకి ఆహ్వానించారు. ఒక్కరు కూడా మిగలకుండా అందరికీ పార్టీ కండువా కప్పడం పట్ల రాజకీయ వర్గాల్లో దుమారం రేగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లిబొల్లి మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎవరు భయపడకుండా నిర్భయంగా తమ సమస్యను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా పలువురికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపీ

బజార్‌హత్నూర్,జూలై7(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఆదిలాబాద్ జిల్లా ఎంపీ గోడంనగేష్ సోమవారం పరామర్శించారు. కాగా మండల కేంద్రంలో పడిపెల్లి గణేష్ తల్లి, అష్టపు సతీష్‌తండ్రి, సుకుల్‌ప్రేంసింగ్ కుమారుడు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి ఓదార్పునిచ్చి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట నాయకులు కొత్తశంకర్, నానంరమణ, చట్లఉత్తం,జీవిరమణ, లక్కంశంకర్, నందు,జామ్‌సింగ్, వినాయక్, నాగ్‌నాథ్ లున్నారు.

బోథ్ : సోనాల మండల కేంద్రంకు చెందిన మాజీ సర్పంచ్ చిన్నయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ జి.నగేష్ సోమవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబం పరామర్శించారు. ఆయన మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన వెంట బిజెపి మండల అధ్యక్షులు బోరె రవీందర్, రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ, మాజీ జెడ్పిటిసి కొత్త శంకర్, నాయకులు సుభాష్, సూర్య, నానం రమణ, రోహిదాస్, డి. గోలే విష్ణు, సూది నందు తదితరులు ఉన్నారు.

శిథిలమైపోతున్న.. 'డబుల్' ఆశలు!

(5వ పేజీ తరువాయి...)

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించక పోవడంతో నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. కేఆర్‌కే కాలనీతో పాటు మావల మండల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు శిథిలాలుగా మారిపోతున్నాయి. కొన్నిచోట్ల అనాధికారికంగా నివాసం ఉంటున్నారు. కొంతమంది డబుల్ బెడ్‌రూం ఇళ్లను కబ్జా చేస్తూ అర్హులైన వారికి అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

ముళ్ల పొదల్లోనే డబుల్ ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా.. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో నిర్లక్ష్యంగానే వదిలేశారు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. కోట్ల రూపాయల నిధులు నేలపాలు చేశారన్న విమర్శలు వస్తున్నాయి. అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మంచి నీటిని సరఫరా చేసే పైపులైన్లు, ట్యాంకులు, తలుపులు, కిటికీలు విరిగిపోయి కనిపిస్తున్నాయి. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు బీటలు వారడంతో ఎప్పుడు కూలిపోతాయో? అర్థంకాని పరిస్థితి ఉందంటున్నారు. వర్షాకాలంలో కురిసే ముసురు వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇకనైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లపై దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగావ్ గ్రామానికి చెందిన పవార్ కళ్యాణికి రూ.16,500, బోథ్ మండల కేంద్రానికి చెందిన ఇఫ్రా అంజూమ్‌కు రూ.9 వే లు మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరడిగొండలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు, తదితరులు ఉన్నారు.

మాజీమున్సిపల్ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్,జూలై7(ఆంధ్రజ్యోతి):మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనిషా తండ్రి రిటైర్డ్ సీఐ లచ్చన్న సోమవారం హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయలశంకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లచ్చన్న పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులున్నారు.

గ్రంథపఠన కార్యక్రమం ప్రారంభం

ఇంద్రవెల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో పూజ్య భంతే కమల్ ధమ్మా ఆధ్వర్యంలో సోమవారం వర్షవాస్ గ్రంథపఠనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ పౌర్ణమి నుంచి మూడు నెలలపాటు గ్రంథ పఠనం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూజ్య భంతే జీవక్, నాయకులు వాగ్మారే కామరాజ్, మహామాయ ఉపాసిక సంఘ్ అధ్యక్షురాలు సోమోరే మాయాబాయి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో జీవో ప్రతుల దహనం

నిర్మల్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ విడుదల చేసిన జీవో 282 అభయన్స్‌లో పెట్టాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలో గల ఆర్డీవో ఆఫీస్ ముందు సోమవారం టీయూసీఐ ఆధ్వర్యంలో జీవో పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ... ఐదోతేదీన ప్రకటించిన జీవో కార్మికులకు వ్యతిరేకంగా ఉందని ఇది యాజమాన్య లాభాలకు అనుకూలంగా ఉందని, దీనిని వెంటనే అభయన్స్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే. లక్ష్మీ, జిల్లా కమిటీ నాయకులు గంగామణి, లక్ష్మీ, విజయ, కమల, లలిత, చట్టి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

బాసర, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ పదోన్నతులతో పాటు బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు భూమన్న యాదవ్ అన్నారు. సోమవారం బాసర మండలంలో పలు పాఠశాలలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బాసర మండలం కౌఠ(బి) ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెండో పీఆర్సీ గడువు ముగిసి నేటికి రెండేళ్లు పూర్తి అయిందని వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మన్, నాయకులు బి. గంగారావు, అశోక్‌కుమార్, బాసర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్. రవీందర్, కె. నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ అభివృద్ధిని అడ్డుకుంటోంది'

లక్ష్మణచాంద, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గల ఎంపీపీ ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరిగాం గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనంలోని చెట్లను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తొలగించారని, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కార్యక్రమంలో పార్‌పెల్లి మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశ్వర్, డైరెక్టర్ సురేష్, అశోక్, ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ ప్రేమ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

చక్ర శివలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నర్సాపూర్(జి), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టెంబుర్ని గ్రామంలో వెలసిన ప్రసిద్ధ చక్ర శివలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీలో చైర్మన్‌గా శ్రీధర్ రెడ్డి, వైస్‌చైర్మన్‌గా ప్రసాద్ గౌడ్, కోశాధికారిగా పెద్ద సాయన్న, రైటర్‌గా శ్రీనివాస్‌లున్నారు. ఈ నూతన కమిటీ ఎన్నికను గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు, గ్రామస్థులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ప్రజాస్వామ్య విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలి

● భైంసా పట్టణ సీఐ గోపినాథ్

భైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రజాస్వామ్య విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ సూచించారు. సోమవారం భైంసా మండలంలోని కథ్‌గాం గ్రామంలో గల వేదం తపోవన్ పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓటు ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధానాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కులం, మతం, బంధుత్వం ఆధారంగా కాకుండా మంచి ఆలోచనలు, బాధ్యతాయుతంగా వ్యవహరించే ప్రతినిధిని, సేవా దృక్పదం కలిగిన నాయకుడికి ఎన్నికల్లో పట్టం కట్టి గెలిపించుకోవాలని సూచించారు. ఇందులో అకాడమిక్ డైరెక్టర్ దత్తాత్రి, ఎన్నికల ఇంచార్జ్ భూమారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

తహసీల్దార్ వద్దని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

లోకేశ్వరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లోకేశ్వరంలోని అన్ని పార్టీలకు చెందిన మండల నాయకులు తహసీల్దార్ మాకు వద్దు అంటూ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ... తహసీల్దార్ పైన తప్పకుండా చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఈ మోహరం పండుగలో ఎలాంటి అవాంచనియా సంఘటనలు జరుగకుండా ఎస్సై శ్రీ

మొక్కల సంరక్షణను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

● భైంసా ఎంఈవో సుభాష్

భైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలను బాధ్యతాయుతంగా చేపట్టాలని భైంసా మండల విద్యాధికారి సుభాష్ పిలుపునిచ్చారు . సోమవారం మండలంలోని కామోల్ గ్రామ ప్రాథమిక , ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వన సంరక్షణయే మన సంరక్షణ అనే ధ్యేయంతో విరివిగా మొక్కలను నాటి పెంచాలని సూచించారు. అడవులు అంతరించిపోవడం మూలంగా వర్షాలు తగ్గిపోవడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. వాతావరణ సమతుల్యత సైతం దెబ్బతింటోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగన్న పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ముజ్గిలో సోమవారం విద్యార్థులు మొక్కలు నాటినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొక్కల వల్ల పర్యావరణం మెరుగుపడుతుందని, వర్షాలు కురుస్తాయని, ప్రాణవాయువు అత్యధిక మోతాదులో అందుతుందని విద్యార్థులకు తెలియజేశారు.

కుంటాల : నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రం కుంటాల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈయన వెంట ఎంపీవో రహీం, పంచాయతీ సెక్రటరీ రాజబాబు, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ముథోల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని సరస్వతి నగర్, ముద్గల్, మచ్కల్, రాంటెక్ గ్రామాల్లో సోమవారం ఆవిర్భావ దినోత్సవం, ఎస్సీ వర్గీకరణ సాధన దినోత్సవం జరుపుకున్నారు. నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి గంధమాల నాగభూషణ్ మాదిగ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమానికి జాతీయ నాయకులు నంద కుమార్ మా జన సోషలిస్ట్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, అంబేకర్ సాయిచంద్ మాదిగ పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌లో సోమవారం మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు షెల్కే ఆనంద్, దిగంబర్ పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రమైన కుంటాలలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు తదితరులు ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆలయాల నిర్మాణాలపై ప్రత్యేకదృష్టి


● ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



మంజూరు పత్రాన్ని అందచేస్తున్న ముథోల్ మాజీఎమ్మెల్యే

భైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గపరిధిలో ఆలయాల నిర్మాణాలు, పునర్‌నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లుగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వెల్లడించారు. సోమవారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో కుభీర్ మండలంలోని పలు గ్రామాల వాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రాధాన్యతననుసారం ఆలయాల నిర్మాణాల నిధుల మంజూరికి బాధ్యతాయుతంగా పాటుపడుతున్నానని వివరించారు. ఎరువుల కొరతను నివారించేందుకు గాను సమృద్ధిగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్‌కు విజ్ఞప్తి చేసినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా పల్సి గ్రామస్తులకు అక్కడ రూ.12 లక్షలతో చేపట్టే దత్తాత్రేయ మందిర నిర్మాణపు మంజూరి పత్రాన్ని అందజేశారు. ఇందులో కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కళ్యాణ్, మాజీ జడ్పీటీసీ శంకర్ చౌహాన్, కుభీర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంతోష్, మాజీ సర్పంచ్ విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన మొహరం వేడుకలు



అగ్నిగుండం దాటుతున్న దృశ్యం

లక్ష్మణచాంద, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముని పెల్లిలో గత ఐదు రోజు లుగా కొన సాగుతున్న మొహర్రం ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక మసీదులోని పీరీలకు (పంజాలు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. మతాలకు అతీతంగా మసీదు ముందు గల అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అస్సైదులా ఆడారు. ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సారంగాపూర్ : మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో గత ఐదు రోజుల నుండి మోహర్రం ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సోమవారం దర్గా వద్ద ఉన్నటువంటి చెల్మ వద్దకు డప్పుమేళాల మధ్య గ్రామస్తులు వెళ్లి చెలిమిలో ఉన్నటువంటి నీళ్ల తీసుకువచ్చి దేవుళ్లను శుద్ధి చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు.



ఫొటోను బహుకరిస్తున్న ముథోల్ బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి'

భైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని ముథోల్ బీఆర్ఎస్ బృందానికి మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. సోమవారం పార్టీ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటి ప్రతినిధి పడకంటి రమాదేవీ, బీఆర్ఎస్ యువజన విభాగం ప్రతినిధి అరేపల్లి సతీష్ నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ స్థితిగతులపై మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ ప్రతినిదుల బృందంతో మాట్లాడి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని తెలిపారు. ముథోల్ బీఆర్ఎస్ బృందం యువజన విభాగం ప్రతినిధి అరేపల్లి సతీష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆయన చిత్రపటాన్ని బహూకరించారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

కుభీర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన తోట రమేష్(34) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... రమేష్ కొన్ని రోజులుగా తాగుడికి బానిసయ్యాడు. ఏ పని చేయకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఏడుగంటలకు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి 12సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. భార్య తోట సంగీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైకి సన్మానం

తానూర్ , జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల ఎస్సైగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై షేక్ జుబేర్‌ను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ తరుపున సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుండ్లిక్, మాజీ సర్పంచ్ మాధవరావుపటేల్, భైంసా మార్కెట్ కమిటీ సభ్యులు మౌలాఖాన్, నాయకులు పుర్‌ఖాన్, అక్బర్‌ఖాన్, అబ్దుల్‌సత్తార్, అల్లాప్ , సయ్యద్, యసుఫ్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పిండిగిర్ని దగ్ధం

కుంటాల, జూలై, 7 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అంబకంటి గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పిండిగిర్ని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో అడెపు ప్రసాద్‌కు చెందిన పిండిగిర్ని దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు రూ. 2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ అడెల్లు, కార్యదర్శి సుమన్ , అసిస్టెంట్ లైన్‌మెన్ సతీష్‌లు సందర్శించారు.

ముగిసిన ఏకాదశి ఉత్సవాలు

కుంటాల, జూలై, 7 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో స్థానిక విఠల రుక్మిణి ఆలయంలో సోమవారంతో ఏకాదశి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులే కుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన తొలి ఏకాదశి వేడుకలు



విఠల రుక్మిణిబాయి వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు

బైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన తొలి ఏకాదశి ముగింపు వేడుకలు అలరించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో విఠల రుక్మిణిబాయిల చిత్రపటాలను వేదికపై ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాలకు చెందిన విద్యార్థుల విఠల రుక్మిణి వేషధారణలతో చేపట్టిన ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. పల్లకిలో విఠల రుక్మిణి చిత్రపటాలకు శోభాయమానంగా అలంకరించి చేపట్టిన శోభాయాత్ర అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు విఠల రుక్మిణిబాయి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు అందరినీ విశేషంగా అలరారించాయి.

విఠోభా పల్లకీ ఊరేగింపు

ఇంద్రవెల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని విఠోబా, దత్త సాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విఠోబా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీ శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా అడుగడుగునా మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తొలి ఏకాదశి ఉపవాస దీక్షలు విరమించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ సాకర్, జెలట్ గోవింద్, చామత్వీర్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



పల్లకి సేవ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘనంగా మొహరం పండుగ

తాంసి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మొహరం పర్వదినాన్ని మతాలకు అతీతంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన తాంసితో పాటు మండలంలోని ఆయా గ్రా మాల్లో పీరీలను రంగు రంగుల బట్టలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. బాజా భజంత్రీలతో పీరీలను ఎగిరించారు. మండలంలోని కప్పర్ల గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గుండం ఆడి అందరిని ఆకట్టుకున్నారు. గిరిగావ్ గ్రామంలో పీరిలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రానికి సుంకిడి, వామనగర్, వడ్డాది గ్రామాలకు చెంది న పలు పీరిలను తీసుకువచ్చి వీధి వీధిలో ఊరేగింపు నిర్వహించారు. బుడం సవారి వద్ద భారీ బందోబస్తు నడుమ సవారిని ఆడించారు.

● స్థానికులతో స్టెప్పులేసిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో పీరీల ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా పండుగ వాతావరణలో ఒకే చోట చేరి మొహరం పండుగను ఘనంగా నిర్వహిం చారు. పీరీల దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. స్థానికులతో కలిసి పీర్ల ఊరేగింపులో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్టెప్పులేశారు.



కప్పర్లలో గుండమాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



వడూర్‌లో పీరీలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

జోరు వానలోనూ తగ్గని పీరీల హోరు

● జనసంద్రంగా మారిన రుయ్యాడి.. ● హస్సేన్ హుస్సేన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్



రుయ్యాడీలోని పీరీలకు పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ రాజార్షి షా

తలమడుగు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జోరు వానలోనూ తగ్గని పీరీల హోరు జనసంద్రంగా మారిన రుయాడి గ్రామం. మత సామరస్యాలకతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయాడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా ఎంతో భక్తిశ్రద్ధలతో హస్సేన్ హుసేన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం, మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఈ మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్థులు వారం రోజులుగా కాళ్లకు చెప్పుల్లేకుండా మద్యానికి దూరంగా ఉంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పండుగ సందర్భంగా రుయ్యాడి గ్రామానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి తెలిపారు. భక్తులను ఆకట్టుకునేందుకు గ్రామస్తులు విచిత్ర వేషధారణ కార్యక్రమాలు చేపట్టారు. తలమడుగు, బరంపూర్, సుంకిడి, ఉండం, ఖోడదు, కుచలాపూర్, జరీ, దేవాపూర్ గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

●రాష్ట్రానికే ఆదర్శం రుయ్యాడి పీరీలు : కలెక్టర్ రాజార్షిషా

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో ఎంతో ముఖ్యమైన పీర్ల పండుగ తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో వారం రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమని అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం మొహరం పండుగ సందర్భంగా రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన మొహరం ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యతతో ఈ పండుగను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. రుయాడీ పీరీలకు 175 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. అనంతరం రుయ్యాడి పీరీల చరిత్ర గురించి చైర్మన్ లోక భూమారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాగా గ్రామంలో పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్‌ల సమస్యలు పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. ఇందులో చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, అడిషనల్ డీఆర్‌డిఏ పీడీ గంగన్న పాల్గొన్నారు.



రుయ్యాడి హుస్సేన్ ఆలయంలో పీరీల ఊరేగింపు

పొంచి ఉన్న ప్రమాదం

● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



బైపాస్ రోడ్డు మార్గంలో ప్రమాదకర స్థితిలోనున్న విద్యుత్ స్తంభం

బైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బైంసాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. డివిజన్ స్థాయి విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపాన్ని అసరగా తీసుకొంటున్న పట్టణస్థాయి అధికారులు అవలంబిస్తున్న బాధ్యతారాహిత్య వైఖరి విధానాలు, నిర్లక్ష్యపూరిత దోరణులతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలు వంగిపోయి పతానవస్థ దశకు చేరుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లోని విద్యుత్ తీగలు వేలాడుతూ ఇబ్బందికర వాతవరణం నెలకొంది. ప్రధానంగా పార్డీ బైపాస్ రోడ్డు మార్గంలో వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వెలాడుతున్న విద్యుత్ తీగల బెడద అధికంగా ఉంది. ఇక్కడి పంటచేలలో వేలాడుతున్న విద్యుత్ తీగలతో భయాందోళన చెందుతున్న అన్నదాతలు ఆయా పంట చేలలో వ్యవసాయ పనులు చేసే సమయంలో బిక్కుబిక్కుమంటున్నారు.కొన్ని ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలు వంగిపోయి పడిపోయే స్థితికి చేరుకున్నప్పటికి వాటిని సరిచేసే చర్యలు చేపట్టడం లేదంటే ఇక్కడి విద్యుత్ శాఖాధికారుల పనితీరు ఎంతటి నిర్లక్ష్యపూరితంగా కొనసాగుతుందో చెప్పకుండానే తెలిసిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి బైంసా పట్టణ పరిధిలో అస్తవ్యస్తంగా కొనసాగుతున్న విద్యుత్ శాఖ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని వినియోగదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పాఠశాలకు వెళ్లే రోడ్డు ఇలా.. విద్యార్థులు నడిచి వెళ్లేదెలా?

బోథ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామంలో వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమ యమయ్యాయి. ముఖ్యంగా పా ఠశాలకు వెళ్లే రోడ్డు బురదతో నిండి పోవడం తో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద కరంగా ఉండడంతో ఈ రోడ్‌లో వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. గ్రామంలో మురికి కాలు వల సైతం మురుగు నీటితో నిండి ఉన్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు కను గుట్ట గ్రామ ప్రజల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.



కనుగుట్టలో పాఠశాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి ఇది

జాతీయ రహదారిపై గుంతలు

● ఇబ్బందుల్లో వాహనదారులు

గుడిహత్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగం గా మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు నిర్మించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. పనులు చేపట్టిన గుత్తేదారు నాసిరకంగా నిర్మించడంతో భారీ గుంత ఏర్పడింది. ప్రతి సంవత్సరం వర్షం కురి సినప్పుడల్లా రోడ్డుపై వర్షపు నీరు నిలువ ఉంటుంది. అయితే వాహనదారులు రోడ్డుపై నుంచి వెళ్తున్నప్పుడు గుంత కనిపించక పోవడంతో వాహనాలు గుంతలో ఇరుక్కుపోవడంతో ప్రమాదాలకు గురైవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రాత్రి సమయంలో అందకరంగా ఉండడంతో గుంత కనిపించని పరిస్థితి నెలకొంది. గుంత ఏర్పడి పది రోజులు కావస్తున్నా సోమా కంపెనీ యాజమాన్యం ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షాలకు గుంతలు ఏర్పడడంతో జాతీయ రహదారిపై నుంచి వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు కూడా పట్టించుకోకుండా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలంటున్నారు.



గుడిహత్నూర్‌లో సర్వీస్ రోడ్డుపై ఏర్పడ్డ గుంత

మత్తడి వాగు ప్రాజెక్టు ఐదు గేట్ల ఎత్తివేత

● 697 క్యూసెక్కుల నీటి విడుదల



గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న వరద నీరు



నిండుకుండలా కనిపిస్తున్న మత్తడి వాగు ప్రాజెక్టు

తాంసి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మత్తడి వాగు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తివేశారు. గత ఐదు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆదివారం రాత్రి ఐదు గేట్లు ఎత్తివేసి వరద నీరును బయటకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 276.30 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 606 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో ఐదు గేట్లు ఎత్తివేసి 697 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 160 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. చీకటి పడ్డ తరువాత వదలడం వల్ల ముందస్తు జాగ్రత్తగా ఆయా గ్రామాల్లో దండోరా వేయించారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది.

ప్రయాణికులకు తప్పిన ముప్పు

● వదులైన బస్సు టైర్ నట్ బోల్టులు ● ప్రమాదాన్ని పసిగట్టి బస్సును నిలిపివేసిన డ్రైవర్



టైర్ నట్ బోల్టులను బిగిస్తున్న గ్యారేజీ కార్మికుడు

బైంసా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వదులుగా మారిన బస్సు టైర్ బోల్టుల పరిస్థితిని పసిగట్టిన డ్రైవర్ ఒకరు సమయస్ఫూర్తితో వ్యవహరించడం మూలంగా పెను ప్రమాదం తప్పింది. బస్సును మార్గమధ్యలోనే నిలిపివేయడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడిన ఘటన ఆదివారం బైంసా సమీపంలో చోటు చేసుకుంది. బస్సులోని ప్రయాణికులు తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బైంసా డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు టీఎస్ 18 టీ 7618 ఉదయం 11 గంటల ప్రాంతంలో నిజామాబాద్ నుంచి బైంసా సమీపానికి చేరుకొంది. 30 మందికి పైగా ప్రయాణీకులతోనున్న సంబంధిత బస్సు కుడి వెనుకవైపు గల రెండు టైర్ల నట్ బోల్టులు వదులుగా మారాయి. ఈ క్రమంలో బస్సు కదిలికలో మార్పులు చోటు చేసుకున్న విషయాన్ని డ్రైవర్ గుర్తించాడు. దీంతో బైంసా సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగానున్న ఒక గ్యారేజ్ పక్కన బస్సును అర్ధాంతరంగా నిలిపివేసాడు. దిగి చూడగా బస్సు కుడి వైపు బాగంలో వెనకున్న రెండు టైర్ల బోల్టులు వదులుగా మారి కనిపించాయి. డ్రైవర్ టైర్ల పరిస్థితిని పసిగట్టి బస్సును మార్గ మధ్యలోనే నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. లేని పక్షంలో బస్సు నుంచి టైర్లు ఊడిపోయి ప్రమాదం చోటు చేసుకునే పరిస్థితులు నెలకొని ఉండేవి. అర్థగంట పాటు బస్సును గ్యారేజీలో నిలిపివేసి వదులుగా మారిన టైర్ల నట్ బోల్టులను బిగింప చేసిన అనంతరం బస్సు బైంసా బస్టాండ్‌కు కదిలింది.

● అథమ స్థాయిలో అద్దె బస్సుల నిర్వహణ

బస్సు డిపో అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా బైంసా బస్సు డిపో పరిధిలోని అద్దె బస్సు నిర్వాహణ వ్యవస్థ లోపభూయిష్టంగా కొనసాగుతోంది. ఇక్కడి డిపో పరిధిలో 47 అద్దె బస్సులు, 28 ఆర్టీసీ బస్సులు కలుపుకొని మొత్తం 75 బస్సులున్నాయి. అయితే డిపో పరిధిలోని అద్దె బస్సుల నిర్వాహణ అధమంగా కొనసాగుతోంది. రోజు ఏదో ఒక రూట్‌లో అద్దె బస్సులు మార్గ మధ్యంలో నిలిచిపోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

గుట్టమీదికి దారి ఇలా.. గ్రామాలకు వెళ్లేదెలా?

● వర్షాకాలంలో గిరిజన గ్రామాలకు తప్పని తిప్పలు



బురదలో ఇరుక్కుపోయిన వాహనాన్ని తోస్తున్న ప్రయాణికులు



డెడ్రా గ్రామం దగ్గర బురద రోడ్డుపై అవస్థలు పడుతున్న వాహనదారులు

బజార్‌హత్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దులోని గుట్టమీది గిరిజన గ్రామాల నుంచి బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే గ్రామీణులకు వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారి గుంతలు ఏర్పడి వాహనాలు కూడా ముందుకు సాగని పరిస్థితి ఏర్పడుతుంది. భూతాయి గ్రామం నుంచి గుట్ట మీద డెడ్రా, గోసాయి ఉమార్దా, ఉమార్డ, గిరిజాయి, బద్దునాయక్ తండా గ్రామాల ప్రజలకు బురద రోడ్డుతో ప్రతి యేటా అవస్థలు తప్పడం లేదు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం బజార్‌హత్నూర్ మండల కేంద్రం నుంచి ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై యూరియా బస్తాలు, ఎరువులను నానా తంటాలు పడి తీసుకెళ్తు కనిపించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా నడవక గుట్ట కిందున్న గ్రామం వరకు ఎడ్లబండిపై గర్భిణీ మహిళలను, రోగులను అతికష్టంతో తీసుకొని వచ్చే పరిస్థితి దాపురించిందని గ్రామీణులు ఆవేదన చెందుతున్నారు. చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారి వాహనాలు నడవని పరిస్థితి ఉంటుందని వాపోయారు. బురదలో వాహనాలు కూరుకుపోయి ప్రయాణికులే నెట్టాల్సి వస్తుందని,ఇబ్బందులను ఎదురించి ట్రాక్టర్లతో బయటికి తీయాల్సి వ స్తుందని తెలిపారు. గతంలో నాయకులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చేడెన్నాడో తమ అవస్థలు తీరేదెన్నడో అంటూ నిట్టూరుస్తున్నారు.

బురద నీటిలోనే వార సంత



బురదమయంగా మారిన వార సంత

కుభీర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుభీర్‌లో ప్రతి గురువారం నిర్వహించే సంతలో సమస్యలు తిష్ట వేయడంతో విక్రయాలు నిర్వహించే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరంలో తైబజారు వేలం పాట ద్వారా రూ. లక్ష 83 వేల ఆదాయం పంచాయతీకి సమకూరింది. అయినప్పటికి సౌకర్యాల కల్పనపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం 15 నిమిషాల పాటు కురిసిన వర్షానికే సంత నిర్వహించే ప్రదేశం జలమయమై వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మార్గాన వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నప్పుడు వ్యాపారులపై సంతకు వచ్చే విక్రయదారులపై బురద జల్లుతోంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతులు కల్పించాలని కోరుతున్నారు.

కుభీర్‌లో అధ్వానంగా పారిశుధ్యం నిర్వహణ



కుభీర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

కుభీర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కుభీర్‌లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రైనేజీ పూడుకుపోయి మురుగు నీరు ఇళ్లముందు, రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన, దోమలు, ఈగల బెడదతో అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. దాదాపు గత నెల రోజులుగా మరుగునీరు ఇండ్ల ముందు ప్రధాన రోడ్డుపై పారుతున్న ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిలిచిన మరుగు నీటి కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగు పరిచి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకోల్పాలని కోరుతున్నారు.



అభివాదం చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఆదివాసీల హక్కుల రక్షణ కోసం కృషి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉట్నూర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో ఆదివాసీల హక్కుల రక్షణ కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ కృషి చేస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూణేం శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని లింగోజీతండా ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల చట్టాలను కాపాడడానికి సంక్షేమ పరిషత్‌ను మరింత పకడ్బందీగా తయారు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ ఉపాధ్యాయ సంక్షేమ పరిషత్, ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్, మరియు విద్యార్థి సంక్షేమ పరిషత్‌లను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాకు నూతన కమిటీని ఖరారు చేసామన్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆరే భీమ్‌రావు, అధ్యక్షుడిగా సెడమకి రామారావు, ఉపాధ్యక్షులుగా కుంర జైతు, మేస్రం మోహన్, ప్రధాన కార్యదర్శిగా సిడాం నందకుమార్, సహాయ కార్యదర్శులుగా ఆడ సంతోష్, మేస్రం నటరాజ్, కోవరమేష్, టేకం మారుతి, ఉమేష్, కోశాధికారిగా కోస్రం ఉదయ్, సలహాదారుగా ఆత్రం భీమ్‌రావు, ముఖ్య నాయకులుగా ఆత్రం పద్మ, అరక దేవరావు, మేస్రం లింగు, కొట్నాక్ కృష్ణ, తదితరులులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

బూత్ లెవల్ అధికారులకు అవగాహన

ఉట్నూర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ ఆదేశాల మేరకు సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్స్‌కు అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్ అమృతలాల్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌గా బానోతు జగన్, రాందాస్‌లు బీఎల్‌వోలకు శిక్షణ అవగాహన కల్పించారు. ఇందులో మండలంలోని 73 మంది బీఎల్‌వోలకు, ఎనిమిది మంది సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



● ఉట్నూర్‌లో ముళ్లపొదల మధ్యలో కనిపిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

శిథిలమైపోతున్న.. 'డబుల్' ఆశలు!

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల జోలికి వెళ్లని రాష్ట్ర ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల పైనే ప్రత్యేకదృష్టిని సారిస్తున్న అధికారులు
- గతంలో లబ్ధిదారులను ఎంపిక చేసినా.. కేటాయింపులు కరువు
- నిర్మాణాలు పూర్తయినా.. నిరుపయోగంగా మారిన ఇళ్లు
- జిల్లాలో సొంతింటి కోసం నిరుపేదలకు తప్పని ఎదురుచూపులు



ఆదిలాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పత్తా లేకుండా పోయింది. ఈ పథకం స్థానంలోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుంది. ఇప్పటికే నిర్మించిన ఇళ్లు పూర్తిగా శిథిలమైపోయి కనిపిస్తున్నాయి. గత నాలుగైదేళ్ల క్రితమే ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా.. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో నిరుపయోగంగా మారి దర్శనమి స్తున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి పాలు కావడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పూర్తిగా కనుమరుగై పోయింది. గడిచిన పదేళ్లలో ఎక్కడా అధికారికంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రూ.కోట్ల నిధులను ఖర్చు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా.. ఉపయోగమే లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు 3,862 ఇళ్లను మం జూరు చేసింది. ఇందులో కేవలం 1,902 ఇళ్లకు మాత్రమే టెండర్లు పూర్తయ్యాయి. దీంతో 1,298 ఇళ్ల నిర్మాణ పనులు మొదలైనా.. వివిధ దశల్లోనే కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 518 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల జోలికి అసలు వెళ్లినట్లే కనిపించడం లేదు. ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. సోమవారం బేల మండలం మసాల గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కలెక్టరేట్‌కు వచ్చిన మసాల గ్రామస్థులు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు

: బసవేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి

గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. ఇప్పటికే జిల్లాలో 500లకు పైగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడం జరిగింది. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. నిధులు లేకపోవంతోనే పనులు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ ఆదేశాలతోనే అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది.

'ఇందిరమ్మ' వైపే మొగ్గు

గత ప్రభుత్వం తీసుకొచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మొగ్గు చూపుతుంది. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎంతో హడావిడి చేసినా.. లబ్ధిదారులకు కేటాయించకుండానే చేతు లెత్తేసింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామని ప్రకటించినా.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. ఇప్పటికే జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై లబ్ధిదారులు ఆశలు వదులుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని కేఆర్‌కే కాలనీ, మావల, జైనథ్, ఉట్నూర్, గుడిహత్నూర్, తదితర మండలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి.

ఎన్నికల ముందే హడావిడి

గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడి చేసినా.. ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించిన దాఖలాలు లేవు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో లక్కీ డ్రా ద్వారా 782 మంది లబ్ధిదారులను అధికారు లు ఎంపిక చేశారు. అర్హుల జాబితాను విడుదల చేసినా..

(తరువాయి 6వ పేజీలో...)



బాలికలతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బొజ్జు

వన మహోత్సవం ఉద్యమంలా సాగాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమాలు ఉద్యమంలా సాగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ గురుకుల కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 2.52 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు వన మహోత్సవంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఈజీఎస్ ఏపీవో రజినికాంత్, పంచాయతీ కార్యదర్శి శంకర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, నాయకులు దాసండ్ల ప్రభాకర్, రాజేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● 'వేతనాల పెంపుదలకు కృషి చేయాలి'

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న తాత్కాలిక, శానిటేషన్ వర్కర్ల వేతనాల పెంపుదలకు కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు రామచందర్‌లు ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి ఐటీడీఏ పీవో ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తమ వేతనాలు పెంపుదల చేయించాలని కోరారు. ఇందులో షాకత్‌హుస్సేన్, దిలీప్‌కుమార్, రాజలింగు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 282 రద్దు చేయాలి : సీఐటీయూ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి):వాణిజ్య సముదాయాల్లో పని చేస్తున్న కార్మికుల పనిదినాన్ని 8 నుంచి 10గంటలకు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన 282 జీవోను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి అనంతరం జీవో 282 ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు పోరాడి సాధించిన 8 గంటల పని దినాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 282ను తీసుకువచ్చిందన్నారు. కార్మికుల పక్షాన కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం యాజమాన్యాల వైపు చట్టాలు, జీవోలను తీసుకు రావడం సరికాదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత షెడ్యులు ఎంప్లాయిమెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను ఇప్పటి వరకు సవరించక పోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికీ షెడ్యుల్డు ఎంప్లాయిమెంట్ కార్మికులు అతి తక్కువ వేతనాలు పొందుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జీవో 282ను రద్దు చేయాలని, లేనిపక్షంలో అసెంబ్లీని, సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందులో దళిత్ జగన్‌సింగ్, రేసు సురేదర్, పొడుగ పొచ్చన్న, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

ఇంద్రవెల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బొడ్డిగూడ, దుబ్బగూడ, కేస్లాగూడ, వాగాయితండా గ్రామాల్లో సోమవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నారా? అని తెలుసుకున్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు తిరుమల, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రణీత, జ్యోతిక, ఏఎన్‌ఎంలు సేవంత, చంపా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా మొహరం పండుగ

- జనసంద్రంగా మారిన రుయ్యాడి
- జోరు వానలోనూ తగ్గని పీరీల హోరు
- హస్సన్ హుస్సేన్ దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- తాంసి, నేరడిగొండలలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

7



నేరడిగొండ ఎస్సైగా ఇమ్రాన్



నేరడిగొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ ఎస్సైగా ఇమ్రాన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకుముందు ఎస్సైగా పని చేసిన శ్రీకాంత్ గుడిహత్నూర్‌కు బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల టుటౌన్ నుంచి బదిలీపై నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఇమ్రాన్ కోరారు.

రేపు సార్వత్రిక సమ్మె : ఏఐటీయూసీ

బోథ్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. గోవర్ధన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెను విజయవంతం చేసేందుకు పాటుపడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

'ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి'

బోథ్, జూలై 7(ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీడీవో రమేష్ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పెంచిన మొక్కలను కళాశాల అధ్యాపకులకు అందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులకు మొక్కలను అందించాలని ప్రతీ ఒక్కరు రెండు మొక్కలను పెంచే విధంగా చూడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'మొరం తరలిస్తే చర్యలు తప్పవు'

నేరడిగొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ పవార్ అన్నారు. సోమవారం మండలంలోని కుప్టి(కే) గ్రామంలో ప్రభుత్వ భూమిలో మొరం అక్రమ తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో జేసీబీని సీజ్ చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట మండల గిర్దవర్ ఎం నాగోరావు, తదితరులు ఉన్నారు.



కుప్టి(కే) గ్రామంలో సీజ్ చేసిన జేసీబీ

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'కి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అర్జిదారులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్జీలపై అధికారులు స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగం(ప్రజావాణి)లో పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను విని వాటిని పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ సోమవారం ప్రజలు ఇచ్చే అర్జీలను అధికారులు క్షుణంగా పరిశీలించి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల పై చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయ శాఖ సంబంధించిన ఫర్టిలైజర్స్ షాప్స్, వైద్యశాఖకు సంబంధించి ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఫీల్డ్ విజిట్, డ్రై డే డ్రైడే, ఆర్‌బీఎస్‌కే టీమ్, మండల అధికారులు, సిబ్బంది ఫీల్డ్‌కి వెళ్లి వివరాలు సేకరించి రిపోర్టు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. కాగా, 91 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ సలోనిచబ్ర, ఆర్డీవో వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజనప్రజల సమస్యల పరిష్కా రానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జీ ఏపీవో జనరల్ దామోదర స్వామి అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీవో సంబంధిత శాఖల అధికారులను కోరారు. ఏపీఓ(పీవీటీజీ) మేస్రం మనోహర్, పీహెచ్‌ఓ సందీప్‌కుమార్, ఏడీఎంహెచ్‌ఓ కుడిమెత మనోహర్, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



అర్జిదారుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్

సిరికొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవైద్యాధికారి డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పాల్గొని కీటక జనిత వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నియంత్రణ, మలేరియా, డెంగ్యూ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాకాలంలో ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రజలు తపLనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే దోమలను అరికట్టే విధంగా ఇంటిలో దోమ తెరలను ఏర్పరుచుకోవాలన్నారు. గ్రామాలలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. హెచ్‌ఈవో గోకుల్, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని భూతాయి(కె) సబ్ సెంటర్ పరిధిలో ఉన్న కోలాంగూడ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భీంరావ్ సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త వహించాలని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. మలేరియా, టైఫాయిడ్, డయేరియా, వాంతులు, విరేచనాలు రాకుండా జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుశల, సూపర్‌వైజర్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ రమేష్,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



కోలాంగూడలో వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

● సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. సోమవారం మండలంలోని రాజురా, బంధం గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఇందులో సంతోష్, హెల్త్ సూపర్ వైజర్ నర్సయ్య, హెల్త్ అసిస్టెంట్ ప్రణీత, పంచాయితీ కార్యదర్శి లావణ్య, ఆశా శారద, ఎస్‌జీటీ, తూర్పు బాయి, అంగన్‌వాడీ లలిత, తదితరులున్నారు.



రాంపూర్(బి)లో పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రతాప్ నాయక్